క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్‌ల మంజూరు


లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్ రాము

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామని ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్ మందా రాము పేర్కొన్నారు. ఉమ్మలాడలో గురువారం వలంటీర్లతో కలిసి ఆయన పింఛన్‌లు అందజేశారు. వచ్చే ఏడాది నుంచి రూ.3000 వంతున పింఛన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో గృహసారథులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి అమ్మవారి పండగ

మునగపాక : పాటిపల్లి, మంగళవరపుపేట గ్రామాల్లో గురువారం దుర్గాదేవి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తగు ఏర్పాట్లు చేశారు.

నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం, కొండకర్ల, దోసూరు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రాము, సోమునాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి రూ.వేయి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణికంఠ, రాజన్న, అప్పలనాయుడు, పైడిరాజు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల్లో క్లీనింగ్


కె.వెంకటాపురంలో స్కూల్ వద్ద చదును చేస్తున్న దృశ్యం

కోటవురట్ల : కె.వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పొక్లెయిన్‌తో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగింపజేసి చదును చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

యలమంచిలి : ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు పట్టణంలో కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు జరగనున్నట్టు మండల విద్యాశాఖాధికారి బి.విశ్వనాథం గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఉదయం 8.45 గంటలకు అనుమతి ఇస్తామని, గణితం పరీక్షకు 5 గదులు ఏర్పాటు చేశామని, విద్యార్థులు తమ వెంట ఎటువంటి కాగితాలు తీసుకురాకూడదని తెలిపారు.

కొండకర్లలో వైద్య శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని కొండకర్లలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 67 రకాల వ్యాధులకు సంబంధించి వైద్యురాలు కళ్యాణి పరీక్షించారు. కె.శిరీషా, రమ్య, లక్ష్మి, శ్రీదేవి, కట్టమూరి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రచనా శైలి అలవర్చుకోవాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): కథలు చదవడం నీతి విషయాలు తెలుస్తాయని, రచనా శైలి ఒనగూడుతుందని అచ్యుతా కళాశాల అధ్యాపకులు లాలం సత్య అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాల 25వ రోజుని పురస్కరించుకొని రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి గ్రంథాలయాల్లో పుస్తకాల గురించి వివరించారు. మరొక రిసోర్స్ పర్సన్ ధర్మిరెడ్డి సన్యాసినాయుడు పౌర శాస్త్రం గురించి వివరించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

- నిబంధనలకు విరుద్ధంగా బోర్ల నిర్మాణం
- గగ్గోలు పెడుతున్న పొరుగు రైతులు
- పట్టించుకోని అధికారులు


మనబానవానిపాలెంలో అనుమతులు లేకుండా బోరు నిర్మించి, సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసిన దృశ్యం

నక్కపల్లి : నీరు, భూమి చెట్టు సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయి. కొంతమంది రైతులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని పక్కన పెట్టేసి ఇష్టారాజ్యంగా తమ భూముల్లో వ్యవసాయ బోర్ల నిర్మాణం చేపడుతున్నారు. అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న ఈ బోర్లపై అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాల్టా నియమ నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేస్తున్న బోర్ల వినియోగం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు, పొరుగు రైతుల పంటలకు నీరు అందక నష్ట పోవాల్సి వస్తోంది. ఇటువంటి అక్రమాలను నియంత్రించేందుకు రైతులందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం 2002లో వాల్టా చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ఈ చట్టం ప్రకారం రైతులు తమ పొలాల్లో వ్యవసాయ బోర్లు నిర్మించుకోవాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలి. జియాలజిస్ట్ నివేదిక పొందాలి. బోరుకు, బోరుకు మధ్య కనీసం 400 అడుగులు దూరం పాటించాలి. ప్రస్తుతం ఈ వాల్టా నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. వాల్టా చట్టాన్ని పూర్తిగా పరిరక్షించే బాధ్యత, బోర్ల నిర్మాణానికి ఎన్‌వోసీలు ఇచ్చే బాధ్యత రెవెన్యూ అధికారులదే. కానీ గ్రామాల్లో వాల్టాకు తూట్లు పొడుస్తూ అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న వ్యవసాయ బోర్ల పట్ల రెవెన్యూ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ఎవరైనా బాధిత రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. మండలంలో ఉపమాక శివారు మనబానవానిపాలెంలో అప్పారావు అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా తనకు చెందిన సర్వే నంబరు 36/7లో వ్యవసాయ బోరు నిర్మించి సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. పక్కనే 20 మీటర్ల దూరంలో బోరు కలిగిన రైతు ప్రణవ్‌రామ్ ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లేదు. తన బోరుకు కేవలం 50 అడుగుల దూరంలో పొరుగు రైతు బోరు నిర్మించడం వల్ల తమ పొలంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, ఇది వాల్టా ఉల్లంఘనకు వస్తుందని బాధితుడు తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రణవ్‌రామ్ సమాచార హక్కు చట్టం కింద అప్పారావు నిర్మించిన బోరుకు అనుమతులు ఉన్నాయా, ఎప్పుడు దరఖాస్తు చేశారు..? అనుమతులు మంజూరు నిబంధనలు పాటించారా..? అనే వివరాలు కావాలని దరఖాస్తు చేశాడు. నెల రోజుల తర్వాత అధికారులు అప్పారావు నిర్మించిన బోరుకు ఎటువంటి అనుమతులు లేవని అతని నుంచి దరఖాస్తు రాలేదని, వాల్టా నిబంధనల విషయం మాకు తెలియదని, మా వద్ద సమాచారం అందుబాటులో లేదని, సోలార్ ప్లాంటుకు అనుమతి సమాచారం తమ వద్ద లేదని దరఖాస్తుదారుకు సమాధానం ఇచ్చారు. వాల్టా చట్టం గురించి తమకు తెలియదని రెవెన్యూ అధికారులు చెప్పడం సిగ్గుచేటని, వారిచ్చిన సమాచారం మేరకు వాల్టా చట్టం ఉల్లంఘన, రెవెన్యూ అధికారుల ఉదాసీనతపై తాను కోర్టును ఆశ్రయిస్తానని బాధిత రైతు ప్రణవ్‌రామ్ తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాల్టా చట్టం పరిరక్షించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మనబానవానిపాలెంలో కె.అప్పారావు నిర్మించిన బోరు నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. రైతు దరఖాస్తు చేయలేదు. జియాలజిస్ట్ నివేదిక కూడా మాకు సమర్పించలేదు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు బోరు నిర్మాణం నిలుపుదల చేయాలని వీఆర్వో ద్వారా హెచ్చరికలు జారీ చేశాం. సదరు రైతు నిబంధనలకు విరుద్ధంగా బోరు నిర్మించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– నీరజ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నక్కపల్లి

చెరువుల సుందరీకరణకు చర్యలు


మునగపాక సీలప్పన్న చెరువును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ రీసోర్స్ కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి

మునగపాక : చెరువుల సుందరీకరణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా పంచాయతీ రీసోర్స్ కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి తెలిపారు. మునగపాకలోని సీలప్పన్న చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెరువులను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ చేసేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పార్కు ఏర్పాటుకు కూడా కృషి చేస్తామన్నారు. ప్రజల వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంతబయిల మార్కెట్‌ను ఆమె పరిశీలించారు. ఆమె వెంట సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీడీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం


వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. వలంటీర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తోటాడ సచివాలయం వద్ద వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సేవలందించడంలో వలంటీర్ల పాత్ర కీలకంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ల చొరవేనన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు బాలాజీ, కోటేశ్వరరావు,మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు, వెలుగు ఏపీఎం కొండమ్మ పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ లేజర్ మిషన్ ప్రారంభం


కంటి ఆపరేషన్ లేజర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : స్థానిక హైమా నేత్రాలయంలో కంటి ఆపరేషన్ చేసే అత్యాధునిక పరికరం లేజర్ మిషన్‌ను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గురువారం ప్రారంభించారు. హైమా నేత్రాలయంలో ఆరోగ్య శ్రీ ద్వారా కంటి ఆపరేషన్ విభాగాన్ని ఇటీవలే ప్రారంభించి, ఆపరేషన్‌లు చేస్తున్నారు. లేజర్ మిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నేత్రాలయం వైద్యులు డాక్టర్ పి.ఎస్.ఆర్ ప్రసాద్‌తో మాట్లాడుతూ కంటికి అవసరమైన ఆపరేషన్‌లను ఆరోగ్య శ్రీ ద్వారా చేసి రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా పాల్గొన్నారు.

మండల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి..


జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్రమ్మతో జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల : మండలంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన 7వ స్థాయి సంఘం సమావేశంలో పలు అంశాలను వివరించినట్టు తెలిపారు. ప్రధానంగా యండపల్లి శివారు వరాహనదిపై అసంపూర్తిగా ఉన్న వంతెన గురించి సూపరింటెండెంట్ ఇంజినీరును ప్రశ్నించామని, త్వరితంగా దానిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్టు తెలిపారు. పందూరు వంతెన గురించి పీఆర్ శాఖాధికారులను అడిగినట్టు తెలిపారు. చౌడువాడకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, నర్సీపట్నం నుంచి మాకవరపాలెం మండలం రాచపల్లి జంక్షన్ మీదుగా చౌడువాడ నుంచి కోటవురట్ల మీదుగా నర్సీపట్నం వరకు బస్సు సర్వీసు వేయాలని కోరినట్టు తెలిపారు. వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని అధికారులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్రమ్మను కోరినట్టు తెలిపారు.

మునగపాక ఎంపీడీవోగా ఈశ్వరరావు



మునగపాక : మునగపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా పీవీఎల్ఎన్ ఈశ్వరరావును నియమిస్తూ గురువారం జిల్లా పరిషత్ సీఈవో పి.శ్రీరామమూర్తి నుంచి ఉత్తర్వులు అందాయి. పంచాయతీరాజ్ శాఖలో ఈవోఆర్డీలు, పరిపాలనాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇక్కడ పరిపాలనాధికారిగా పనిచేసిన పి.రవికుమార్‌ను విజయనగరం జిల్లాకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఇక్కడ ఈవోఆర్డీగా పని చేస్తున్న ఈశ్వరరావుకు మునగపాక ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

రాజుపాలేనికి ఆధ్యాత్మిక శోభ


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయం గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అర్చకులు డి.కల్యాణ్‌కుమార్ ఆచారి ఆధ్వర్యంలో మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరిగింది. అంతకు ముందు విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, కమిటీ సభ్యులు రామకోటేశ్వరరావు, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

85శాతం పింఛన్లు పంపిణీ


కొత్తూరులో పింఛన్లు పంపిణీ

రాంబిల్లి : మండలంలో గురువారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజే 85 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి


రాంబిల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న దేముడునాయుడు తదితరులు

రాంబిల్లి : ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. రాంబిల్లిలో గురువారం మహిళా రెజ్లర్లకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, గణేష్, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతికథలు, పేపర్ క్రాఫ్ట్ పోటీలు


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. పుస్తక పఠనంపై సాధన చేయించారు. నీతి కథలు, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఈతకు వెళ్లి ప్రమాదాలు బారిన పడవద్దని మహిళా పోలీసు టి. వెంకటలక్ష్మి విద్యార్థులను హెచ్చరించారు. ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారి వార్తలను పత్రికల్లో ప్రచురితమైన కథనాలను చూపించి విద్యార్థులను అప్రమత్తం చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు


పాములవాకలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కోటవురట్ల : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అనేక విధాలుగా ఆసరా కల్పిస్తున్నారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. పాములవాకలో గురువారం సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా నిధులు విడుదల సందర్భంగా సీఎం జగన్ ప్రసంగాన్ని టీవీ స్క్రీన్‌పై వీక్షించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి


రోడ్డు రోలర్ నడుపుతున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : అమ్మా నీకు పింఛను వస్తోందా?..వలంటీర్లు ఎమైనా ఇబ్బంది పెడుతున్నారా..చెల్లెమ్మా అమ్మ ఒడి నగదు పడుతోందా..పిల్లలను బాగా చదివించాలి..అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. చినబొడ్డేపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఆక్సాహేబుపేట పంచాయతీ యాషాడపాలెంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీస్సులు అందించాలని, మళ్లీ ఆయనే సీఎం కావాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వ పాలనను సీఎం జగన్ పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. ఎవరు మోసం చేశారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. చంద్రబాబు నైజం ప్రజలను మోసం చేయడమే అన్నారు. బూటకపు హామీలతో బురిడీ కొట్టించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎన్నికలు ఎపుడు వచ్చినా చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షించే జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి కలగుతోందన్నారు. నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయన్నారు. చిరు వ్యాపారులను కూడా ఆదుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఖరీఫ్ సీజనుకు ముందుగానే అన్నదాతలకు ఆసరా కలిగేలా రైతు భరోసా నిధులు జమచేశారన్నారు. రైతులు సాగు కోసం భయపడాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడి నిధులు ఇవ్వడమే కాకుండా ఎరువులు, యంత్ర రూపంలో కూడా రైతులకు అండగా ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, చినబొడ్డేపల్లి సర్పంచ్ పైల శివరామ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అవుగడ్డి రాజకుమారి, పార్టీ నాయకులు అవుగడ్డి రాజీవ్, శ్రీను పాల్గొన్నారు.

రోడ్ రోలర్‌ను నడిపిన ఎమ్మెల్యే..

గడప గడప కార్యక్రమంలో భాగంగా దారిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా ఎమ్మెల్యే వారిని పలకరించి పనులు ఎలా జరుగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. రోడ్డు రోలర్‌ను నడిపి అందరిలో ఉత్సాహాన్ని నింపారు.

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ


మాట్లాడుతున్న మైక్రో ఇరిగేషన్ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

మునగపాక : రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తున్నామని మైక్రో ఇరిగేషన్ ఓఎస్‌డీ (టెక్నికల్) వై.వెంకటేశ్వర్లు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆయన మండలంలోని నాగవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. డ్రిప్‌కు సంబంధించి 5 ఎకరాల లోపు రైతులకు 90 శాతం రాయితీ, 5 నుంచి 12.50 ఎకరాల లోపు రైతులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. స్ప్రింక్లర్ల విషయానికి వస్తే 5 ఎకరాల లోపు రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాలు దాటిన రైతులకు 45 శాతం రాయితీ అందజేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు వన్‌బీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబరుతో రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నీటిలో కరిగే ఎరువుల ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి జి.వి. లక్ష్మి, స్థానిక అధికారులు సాగర్, రంజిత పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల పరిష్కారానికి కృషి


తురంగలపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాణీ అమ్మాజీ

యలమంచిలి : జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రాణీ అమ్మాజీ అన్నారు. గురువారం ఆమె మండలంలో తురంగలపాలెం గ్రామంలో పర్యటించారు. స్పందనలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నేరుగా సాగు చేస్తున్న రైతులు వద్దకు వెళ్లి వారి భూమి హక్కు పత్రాలను పరిశీలించి విచారణ స్టేట్‌మెంట్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవలే జగనన్నకు చెబుదాం కార్యాక్రమాన్ని చేపట్టారని, రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే వాటి కోసం ప్రజలు తమ సమస్యలు నేరుగా జగనన్నకు చెబుదాం ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియపరచుకోవచ్చు అని అన్నారు. రైతులు సమగ్ర భూ సర్వేలో సాగు లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

తల్లి దైవం, తండ్రి గురువు


విద్యార్థులకు బోధిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు


పాయకరావుపేట : ప్రతి వ్యక్తికి తల్లే దైవం, తండ్రే గురువు అని, ప్రతి వ్యక్తికి తల్లిదండ్రులు గురువు, దైవం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో గురువారం తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తల్లిదండ్రుల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ మాట్లాడడం, చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సీతారామయ్య, రమణమూర్తి రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మునగపాక బీసీ కాలనీలో ఉద్రిక్తత

- అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అభ్యంతరం
- అధికారులను అడ్డుకున్న కాలనీవాసులు

మునగపాక : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణ పనులు చేపట్టేందుకు వచ్చిన అధికారునలు అడ్డుకొని తమకు కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు అంగీకరించేది లేదని భీష్మించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ అలీ సంఘటన స్థలానికి చేరుకొని సమస్య శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. మునగపాక బీసీ కాలనీలో సామాజిక అవసరాల కోసం గతంలో కేటాయించిన స్థలంలో అంగన్‌వాడీ నిర్మాణానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. గురువారం ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు పొక్లెయిన్‌తో రెవెన్యూ సిబ్బంది రాగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయాల్సిన బాధ్యత తమపై ఉందని ఇందుకు కాలనీ వాసులు సహకరించాలని ఎస్ఐ వారిని కోరారు. అయినా కాలనీవాసులు అంగీకరించకపోవడంతో ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు కలుగజేసుకొని రెండు, మూడు రోజుల్లో తామంతా సమావేశమై నిర్ణయం తీసుకుంటామని, అంతవరకు ఇక్కడ ఎటువంటి పనులు చేపట్టవద్దని కోరడంతో అధికారులు వెనుదిరిగారు.

శ్రీ ప్రకాష్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్


ఎంఎస్ఎన్ ల్యాబ్ జాబ్‌కు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 29 మంది విద్యార్థులను ఎంఎస్ఎన్ ల్యాబ్ ప్రతినిధి కిరణ్ కుమార్ ఎంపిక చేశారు. ఎంపికైనవారు హైదరాబాద్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వర్తిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ హెచ్ఓడీ శివగంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.